క్లుప్తంగా

గంగమ్మకు బోనాలు



గంగమ్మ తల్లికి విశేషాలంకరణ

కడప అర్బన్ : గంగమ్మ తల్లి జాతరలో భాగంగా కడప నగరంలోని నబీకోటలో అమ్మవారికి ఆదివారం బోనాలతో తీసుకెళ్లి నైవేద్యం సమర్పించారు. తెల్లవారుజామున 12:35 గంటలకు గంగమ్మతల్లి అమ్మవారికి అభిషేకం, అలంకరణ తదుపరి బోనాల కార్యక్రమం నిర్వహించారు. భక్తులు తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. వందలాది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. భక్తులు దర్శించుకుని తమ మొక్కుబడులు తీర్చుకున్నారు.

అలరించిన ఆట.. పాట



శిల్పారామంలో చిన్నారుల నృత్యాలు

కడప కల్చరల్ : ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా కడప శిల్పారామంలో నిర్వహించిన ఆట.. పాట కార్యక్రమం అందరినీ అలరించింది. స్థానిక మిస్పా మూవీ ఆధ్వర్యంలో కడప నగరానికి జీఆర్‌కే, జీవీకే హైస్కూల్‌కు చెందిన చిన్నారులు పలు ప్రాచుర్యం పొందిన సినీగీతాలు, జానపద పాటలకు హుషారు గొలిపే నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. వారు ప్రదర్శించిన హాస్య సన్నివేశాలకు ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల కరస్పాండెంట్ రజిని, శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహించి సూచనలిస్తున్న వైద్యులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని ఎస్‌బీఐ కాలనీలోని సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో శంకరాపురం సత్యసాయి గోకుల్ రెసిడెన్సీలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నగర పరిసర ప్రాంతాల నుండి ఉబ్బిన రక్తనాళాలు, సాలె పురుగు రక్తనాళాలు, పాదాల వాపు, సిరిపుండ్లు, తలకు రక్త సరఫరా లోపాలు కలిగిన 120 మందికి ఉచిత స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. తదుపరి వైద్య చికిత్స నిమిత్తం సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు సీవీ.సురేంద్రబాబు, కడప సమితి కన్వీనర్ వంకదార సాయికుమార్, సత్యసాయి సేవా సంస్థల పూర్వపు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సందా సూర్యప్రకాష్, డాక్టర్ సందా మహాలక్ష్మి, డాక్టర్ సందా ఆకాష్‌లు ఈ శిబిరాన్ని నిర్వహించి సంపూర్ణ సహాయ సహకారాలు అందించారు.

జగదీశ్వరరావు సేవలు మరువలేనివి..



జగదీశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న అధికారులు

కడప, కోటిరెడ్డి సర్కిల్ : ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో జీఎంగా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన ఎం జగదీశ్వరరావు సేవలు మరువలేనివని బ్యాంక్ చైర్మన్ రాజు కశ్యప్ పేర్కొన్నారు. ఆదివారం బిల్టప్ సమీపంలోని బ్యాంక్ హెడ్ ఆఫీస్ లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జగదీశ్వరరావు, రాధిక దంపతులను ఘనంగా సన్మానించారు. సంస్థ చైర్మన్ తో పాటు జీఎం విజయభాస్కర్, ఇతర బ్యాంకు ఉన్నతాధికారులు జగదీశ్వరరావు బ్యాంకుకు చేసిన సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో జగదీశ్వరరావు బంధువులు స్నేహితుల కుటుంబ సభ్యులతో పాటు బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

మెడికల్ సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్సీ జనసంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పసుపులేటి శివకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ శుక్రవారం జిల్లా ఆస్పత్రిలో ఇసుకదిన్నెలకు చెందిన ఇమాంబీ అనే మహిళ అనారోగ్యంతో క్యాజువాలిటీ డాక్టర్‌ను సంప్రదించగా సరైన వైద్యం అందలేదన్నారు. దీంతో తాను సూపరింటెండెంట్‌కు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయకపోవడంతో డీసీహెచ్ఎస్, జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి సరైన వైద్యం అందించాలని కోరానన్నారు. దీంతో మెడికల్ సూపరింటెండెంట్ తనను, పేషెంట్ భర్త రాజును దుర్భాషలాడారని తెలిపారు. పేషెంట్‌ను ఆస్పత్రి నుంచి తీసుకెళ్లకపోతే మీ అంతు చూస్తానని బెదిరించారని, ఎవరికి ఫిర్యాదు చేసినా భయపడేది లేదని హెచ్చరించారని శివకృష్ణ తెలిపారు.

క్రీస్తు పునరుత్థానం.. లోకానికి కొత్త జీవం

ఘనంగా ఈస్టర్ వేడుకలు



మాట్లాడుతున్న పాస్టర్ మత్తయ్య బాబు



హాజరైన క్రైస్తవులు

కడప కల్చరల్ : ఈస్టర్ సందర్భంగా కడప నగరంలోని అన్ని చర్చిలలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలుచోట్ల శనివారం అర్ధరాత్రి నుంచి మరి కొన్నిచోట్ల ఆదివారం తెల్లవారు జామున ఐదు గంటల నుంచి ఈస్టర్ ప్రార్థనలు నిర్వహించారు. తన పునరుత్థానంతో తానే జీవమునని క్రీస్తు ప్రపంచానికి చాటారని సీఎస్ఐ సెంట్రల్ చర్చి పాస్టర్ రెవరెండ్ మత్తయ్యబాబు అన్నారు. క్రీస్తు మరణం నుంచి మూడవ రోజున కొత్త జీవంతో పునరుత్థానం చెందడం దైవాన్ని మహిమ పరిచినట్లయిందన్నారు. ఈ సందర్భంగా వారు బైబిల్‌లోని క్రీస్తు ఘటనలను భక్తులతో చదివించి అర్థాన్ని వివరించారు. పలువురు గురువులు ఇతర చర్చిలలో ప్రార్థనలు చేయించారు. క్యాథడ్రల్ చర్చిలో విచారణ గురువులు ఆధ్వర్యంలో, మద్రాసురోడ్డులోని రామాంజనేయపురం పాస్టరల్ సెంటర్‌లో కడప కథోలిక పీఠంలోనూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆరోగ్యమాత పుణ్య క్షేత్రంలో గురువులు దివ్య బలిపూజ, ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా పలువురు విశ్వాసులకు దివ్య సత్‌ప్రసాదం అందజేసి ఆశీర్వదించారు. క్రీస్తు శరీరాన్ని త్యాగం చేసినందుకు గుర్తుగా చిన్న రొట్టె ముక్కను, రక్తాన్ని ధారపోసినందుకు ప్రతీకగా ద్రాక్ష రసాన్ని భక్తులకు ప్రసాదంగా అందజేశారు.

కాంగ్రిగేషనల్ చర్చిలో..

కడప నగరంలోని కాంగ్రిగేషనల్ టౌన్ చర్చిలో ఈస్టర్ ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి జరిగిన ఈ ప్రార్థనల్లో పాస్టర్ మోహన్‌బాబు ఈస్టర్ సందేశాన్ని చదివి వినిపించి అర్థాన్ని వివరించారు. ప్రత్యేక ప్రార్థనల్లో చర్చి కార్యదర్శి విజయుడు, కోశాధికారి నోవా బెన్నీ, సంఘపెద్దలు సంజీవరాయుడు, మనోహర్, స్థానిక చిన్నచౌక్‌లోని అశోక్‌నగర్ హోలీజీసెస్ కెథిడ్రల్ చర్చిలో పాస్టర్ శ్యామ్యూల్‌బాబు ఈస్టర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

కృపా చర్చిలో..

బిల్టప్ వద్దగల న్యూ నేటివ్ కృపా ప్రార్థనా మందరంలో దైవజనులు పి.మహేష్, సిస్టర్ శాంతమ్మల ఆధ్వర్యంలో ఈస్టర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ క్రీస్తు మానవాళి పాపాల పరిహారం కోసం తనను తాను శిలువకు అప్పగించారన్నారు. ప్రజలను ఆధ్యాత్మికంగా చైతన్య పరిచేందుకు శిలువపై మరణించి మూడవరోజు సజీవుడిగా తిరిగి వచ్చాడని, ఆయన చూపిన బాటలో ప్రజలు కక్ష, ద్వేషాలు, చెడు వ్యసనాలకు దూరంగా ప్రేమమయ జీవితాలను కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రవితేజ, శాంతిరాజు, లీలావతి, సుధాకర్, రోజా, అంజలి, నరసయ్య, వానలయ్య, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న పాస్టర్ మహేష్

గృహ నిర్మాణ సంఘాన్ని అభివృద్ధి చేస్తాం

కడప రూరల్ : జిల్లా ఎన్జీఓ గృహ నిర్మాణ సంఘం అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామని ఏపీ జిల్లా ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. స్థానిక గృహ నిర్మాణ సంఘం కార్యాలయంలో ఆదివారం మహాజన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ఎన్జీఓ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ.శివారెడ్డి, పురుషోత్తంనాయుడుల సహకారంతో గృహ నిర్మాణ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షులు కొండారెడ్డి, కేఎస్‌వీ.ప్రసాద్, రాఘవరెడ్డి, పాల్గొన్నారు.

ప్రతి ఉపాధ్యాయుడు విధులకు హాజరుకావాలి

డీఈఓ మర్రెడ్డి అనురాధ

కడప ఎడ్యుకేషన్ : కడప మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో ఈ నెల 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్న మూల్యాంకన విధులకు సంబంధించి ఆర్డర్ ఇచ్చిన ప్రతి ఉపాధ్యాయుడు విధులకు తప్పని సరిగా హాజరు కావాలని డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. ఈ విషయంలో ఎవరికీ మినహాయింపు లేదన్నారు. అందరూ తప్పకుండా హాజరై మూల్యాంకన కేంద్రంలో రిపోర్టు చేసుకోవాలని డీఈఓ తెలిపారు.

ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోవాలి

కడప డీఎస్పీ ఎం.డి.షరీఫ్



కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

కడప అర్బన్ : ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి ఆదివారం సాయంత్రం కడప నగరంలోని టూటౌన్ పరిధిలోని పలు ప్రాంతాలలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు కడపడీఎస్పీ ఎం.డి.షరీఫ్ ఆధ్వర్యంలో నకాష్, అగాడి, సాయిపేట, వక్కలపేట, అల్మాస్‌పేటలోని ప్రధాన రహదారుల గుండా ఫ్లాగ్ మార్చ్ కొనసాగింది. ఈ సందర్భంగా కడప డీఎస్పీ ఎం.డి.షరీఫ్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పోలీసులు ప్రజలకు భరోసా కల్పించేందుకు, అల్లర్లు జరుకుండా, శాంతి భద్రతలను కాపాడటానికి కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని డీఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కడప టూటౌన్ సీఐ జి.ఇబ్రహీం, చిన్న చౌక్ సీఐ నరసింహారెడ్డి, తాలూకా సీఐ తిమ్మయ్య, ఎస్‌ఐలు రంగస్వామి, మధుసూదన్‌రెడ్డి, రవికుమార్, సంజీవరాయుడు, మహమ్మద్ రఫీ, ఎం.ఏ.ఖాన్, చంద్రమోహన్, తిరుపాల్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

విశేష అలంకరణలో అమ్మవారు



చింతకొమ్మదిన్నె : స్థానిక గంగమ్మతల్లి ఆలయంలో మూడో వారమైన ఆదివారం భక్తులు అమ్మవారిని అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. అలాగే అమ్మవారికి తెల్లవారు జామునే అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ పి.బి.విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో మహిళాభక్తులకు గాజులను పంపిణీ చేశారు. సీఐ శంకర్‌నాయక్ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణలో అధిక ధరలతో టెంకాయలు విక్రయిస్తుండటంతో వారిని ఆలయ అధికారులు హెచ్చరించినా ఫలితం లేదని భక్తులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అనుమతిలేని కేంద్రాలపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో అనుమతి లేని పాలిటిక్నిక్, ఏపీ ఆర్‌జేసీ కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు విద్యా శాఖ అధికారులను కోరారు. తమ కార్యాలయంలో విలేకర్లతో ఈ సందర్భంగా ఆయన ఆదివారం మాట్లాడుతూ జిల్లాలో చాలా ప్రాంతాల్లో ప్రభుత్వ నిబంధలనలకు విరుద్ధంగా చాలా కోచింగ్ సెంటర్లను నిర్వహిస్తున్నారన్నారు. ఒక్కో విద్యార్థి వద్ద నుంచి రూ.5వేల వరకు డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అనుభవం ఉన్న అధ్యాపకుల చేత కాకుండా ఇతరులతో కోచింగ్ ఇప్పిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు నరేంద్ర, నాయకులు అయ్యన్న, హరికృష్ణారెడ్డి, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రగతిశీల విద్యార్థి సంఘ నాయకులు

ఐఐటీ విద్యార్థికి 'మానవత' సాయం

కడప కల్చరల్ : ఖరగ్‌పూర్ ఐఐటీలో చదువుతున్న విద్యార్థి ఓబుళరెడ్డికి చెన్నూరు మానవత స్వచ్ఛంద సంస్థతో కలిసి ఆదివారం రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు. సంస్థ జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు ఈ మొత్తాన్ని విద్యార్థి తల్లిదండ్రులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మానవత సంస్థ లక్ష్యాలలో ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం ముఖ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాఖ కార్యవర్గ సభ్యులు వినోద్‌కుమార్‌రెడ్డి, చెన్నూరు శాఖ చైర్మెన్ జయభారతిరెడ్డి, అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, నారాయణరెడ్డి, బసిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి తల్లిదండ్రులను సత్కరిస్తున్న మానవత ప్రతినిధులు

ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

కలెక్టరేట్ ఏవోకు ఏపీటీఎఫ్ నాయకుల వినతి



కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో మే 13న జరగబోయే సార్వత్రి ఎన్నికల విధుల నుంచి దీర్ఘకాలిక వ్యాధులైన గుండె, క్యాన్సర్స్, కిడ్నీ, న్యూరో సంబంధిత వ్యాధులతో బాధపడే ఉపాధ్యాయులకు, చంటిబిడ్డల తల్లులకు, దివ్యాంగ ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాసుందర్‌రెడ్డి కోరారు. కలెక్టరేట్ ముఖ్య ప్రణాళిక అధికారి వెంకటస్వామిని కలిసి ఈ విషయమై వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా 60 సంవత్సరాలు దాటిని ఉపాధ్యాయులను ఎన్నికల విధులకు మినహాయింపు ఇవ్వాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో మెరుగైన వసతులను కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్‌భాష, శ్రీనివాసులరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ గురయ్య, జిల్లా కార్యదర్శులు నరసింహారెడ్డి, రామచంద్రారెడ్డి, రామసుధాకర్‌రెడ్డి, జిల్లా కౌన్సిలర్లు నరసింహులు, మస్తాన్‌బాబు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో పనిచేయడం నా అదృష్టం

అంబవరం ప్రభాకర్‌రెడ్డి



కడప ఎడ్యుకేషన్ : విద్యాశాఖలో సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారిగా పనిచేయడం తన అదృష్టమని అంబవరం ప్రభాకర్‌రెడ్డి అన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ విద్యా శాఖలో ఐదేళ్లపాటు పనిచేసిన ఆయన తమ మాతృశాఖ వ్యవసాయశాఖకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా శాఖలో మనబడి నాడు నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు అన్ని రకాల మౌలిక వసతులను కల్పించామన్నారు. వరుసగా 5 సార్లు ఉత్తమ జిల్లా అధికారిగా కలెక్టర్ నుంచి ప్రశంసపత్రాలను అందుకున్నానన్నారు.

ఘనంగా శ్రీ చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు



గ్రామోత్సవంలో చౌడేశ్వరీదేవి అమ్మవారు

వల్లూరు : మండలంలోని వెంకటాపురం వీవర్స్ కాలనీలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామున అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించి, గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. శ్రీ చౌడేశ్వరీదేవి పులి వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామోత్సవంలో అమ్మవారికి ముందు మహిళలు నీటిని వారపోస్తూ మొక్కులు తీర్చుకున్నారు. గ్రామోత్సవం వెంట 13 జ్యోతులను భక్తులు తలలపై పెట్టుకుని అమ్మవారి పాటలకు అనుగుణంగా విన్యాసాలను చేశారు.

దుగ్గాయపల్లెలో ఉత్సవాలు ప్రారంభం

దుగ్గాయపల్లెలో చౌడేశ్వరీదేవిజ్యోతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం గ్రామంలో చల్ల కార్యక్రమం నిర్వహించారు. జ్యోతులను మొక్కుబడుల రూపంలో సమర్పించనున్న భక్తులు ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించి జ్యోతుల తయారీని ప్రారంభించారు. అలాగే పలు గ్రామాల్లో ప్రజలు జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం



కమలాపురంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయమని కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలో ఇపెంట పంచాయతీ పరిధిలోని బోడెద్దులపల్లి, జమాల్‌పల్లి గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి మాట్లాడారు. కులాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, ఇలాంటి పథకాలు తిరిగి అందాలంటే మళ్ళీ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తిరిగి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నారా చంద్రబాబు నాయుడు 14 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా ఉండి, ఏ ఒక్క వర్గానికి కూడా మేలు చేసిన దాఖలాలు లేవన్నారు. రాబోవు ఎన్నికల్లో ప్రతి ఒక్కరు కూడా ఫ్యాను గుర్తుపై ఓటు వేసి వేయించాలని ఆయన ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి, కో కన్వీనర్ యాదవ్, మాజీ మండల కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ మల్లికార్జున యాదవ్, సుబ్బరాయుడు, కొత్తపల్లి రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు నారే నాగరాజు, ప్రసాద్‌రెడ్డి, సేవాదళ్ అధ్యక్షుడు సిద్దు, మైనార్టీ నాయకులు రహమతుల్లా, కువైట్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇంటింటి ప్రచారం

కమలాపురం : పట్టణంలోని 6వ కౌన్సిల్ వార్డులోని అక్సా నగర్, ఎంపీడీఓ కాలనీ తదితర ప్రాంతాల్లో కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఆయన కుమార్తె డాక్టర్ రమ్యతారెడ్డిలు ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. మైనార్టీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఇస్మాయిల్ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డిని ముస్లిం సాంప్రదాయ పద్ధతిలో సత్కరించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు తాను చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు ఎమ్మెల్యే వివరించారు. ఈ సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, మరింత అభివృద్ధి జరగాలన్నా ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వైఎస్ అవినాష్‌రెడ్డి, పీ.రవీంద్రనాథ్‌రెడ్డిలను ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, గౌస్‌మొహిద్దీన్, ఎస్‌సీ పుల్లారెడ్డి, గంగాధర్‌రెడ్డి, నిఖిల్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, ఇస్మాయిల్, సాదిక్, శ్రీనివాసరెడ్డి, ఆర్‌వీఎస్‌ఆర్, ఇర్ఫాన్, గఫార్, రామసుబ్బారెడ్డి, అంబటి సురేష్, షావలి, జిలాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందుకు హాజరు:


పట్టణంలోని ఫకీర్ వీధిలో ఉన్న మర్కజ్ మసీదులో మున్సిపల్ వైస్ చైర్మన్ మహ్మద్‌సాదిక్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి హాజరయ్యారు. ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలకు ఎమ్మెల్యే ఖర్జూర పండ్లు తినిపించి దీక్ష విరమింపజేశారు. అనంతరం విభరాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు నారపురెడ్డి తల్లి మద్దూరి గంగమ్మ శనివారం రాత్రి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మంచి జరిగి ఉంటేనే మరో అవకాశం కల్పించండి

జమ్మలమడుగు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల ప్రజలు లబ్ధిపొంది ఉంటే వైఎస్సార్‌సీపీకి మరో అవకాశం కల్పించి ఎమ్మెల్యేగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ప్రజలను కోరారు. ఆదివారం పట్టణంలోని 9 వార్డులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి మాట్లాడారు. గతంలో ఉన్న నాయకులు ఫ్యాక్షన్ ను ప్రోత్సహించేవారన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎంపికైన నాటి నుంచి ఇప్పటివరకు చిన్న సంఘటనలు కూడా నియోజకవర్గంలో జరుగలేదన్నారు. టీడీపీ పాలనలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు చేసిన మోసాలు, ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి ప్రజలను మా ప్రభుత్వంలో మేలు జరిగి ఉంటేనే ఓటు వేయండని అడగలేదన్నారు. చేనేత కార్మికులకు ఏడాదికి రూ.24 వేలు వైఎస్సార్ నేతన్ననేస్తంతో పాటు, 50 సంవత్సరాలు నిండిన చేనేత కార్మికులకు పెన్షన్ ఇస్తున్నాడన్నారు. ప్రజలు వైఎస్సార్ సీపీని గెలిపిస్తే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి చేసుకునే అవకాశం కల్పించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, హస్తకళల అభివృద్ధి చైర్మన్ బడిగించల విజయలక్ష్మీ, స్థానిక నాయకులు కత్తి శ్రీనివాసులరెడ్డి, వేణు, డాక్టర్ ఆగస్టీన్‌రాజు, చాంద్‌బాషా, కో ఆప్షన్ సభ్యుడు లక్షుమయ్య, ఫయాజ్, హృషికేశవరెడ్డి, బడిగించల చంద్రమౌళి, యాసోబు తదితరులు పాల్గొన్నారు.

మరింత మెరుగైన సేవలు అందిస్తాం.. ఆదరించండి

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



పార్టీ కరపత్రాన్ని ప్రజలకు అందించి ఓట్లు అభ్యర్థిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

లింగాల : రాష్ట్రంలో మరింత మెరుగైన సేవలు అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోక అవకాశం ఇవ్వాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రజలను అభ్యర్థించారు. మండలంలోని అంబకపల్లెలో ఆయన ఆదివారం సార్వత్రిక ఎన్నికల ప్రచారాన్ని ఇంటింటికి తిరిగి నిర్వహించారు. ముందుగా లింగాల మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వైఎస్ అభిషేక్‌రెడ్డితో కలిసి గ్రామంలోని శ్రీ అవధూత ఆవులస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వైఎస్సార్‌సీపీ నేతలు, గ్రామనాయకులు వారిని గజమాలతో సత్కరించారు. అనంతరం ఎంపీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించి మట్లాడారు. ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చామని, ప్రజలకు మరింత సేవ చేసేందుకు తిరిగి ఆశీర్వదించాలని ఆయన ప్రజలను కోరారు. గత ఐదు సంవత్సరాల్లో ప్రజలకు అందించిన సేవలను వివరిస్తూ మరింత మెరుగైన సేవలను ప్రజలకు అందించేందుకు తిరిగి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎంపీగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పీవీ సుబ్బారెడ్డి, ఎంపీపీ అలవలపాటి రమాదేవి, వైఎస్సార్‌సీపీ కడప పార్లమెంటరీ కన్వీనర్లు సారెడ్డి చంద్రశేఖరరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కడప పార్లమెంటరీ యూత్ కన్వీనర్ శివకుమార్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు ఏవీ శ్రీనివాసరెడ్డి, రామాంజులరెడ్డి, మాజీ ఎంపీపీ నర్రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కర్ణా రమేష్‌కుమార్‌రెడ్డి, అంబకపల్లె వైఎస్సార్‌సీపీ నాయకులు బాబురెడ్డి, వెంగల్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, చెన్నకేశవరెడ్డి, గంగిరెడ్డి, తేజేశ్వర్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.